# 'కోల్డ్' వార్!

**- ప్రతాప వెంకట సుబ్బారాయుడు**



కోదండరామయ్యగారికి మనసంతా వికలంగా వుంది.

వుండదు మరి? కూతురు శ్రావణిని లక్షల కట్నమిచ్చి చక్రధర్‌కి కట్టబెట్టాడు. తల్లిలేని పిల్ల. పెళ్ళై మూడు నెలలయింది. వాళ్ళ సంసారం ఎలావుందో చూసిరమ్మని తన నమ్మినబంటు అప్పిగాడిని పంపించాడు.

వాడు చెప్పింది విని హతాశుడయ్యాడు.

వాళ్ళ మధ్య మాటల్లేవట. ఎడముఖం పెడ ముఖంగా వుంటున్నారట. వాళ్ళిద్దరి మధ్యా ముద్దూముచ్చట అన్నది భూతద్దంతో వెతికి చూసినా కన్పించలేదట.

ఒక్కోమాటా ముల్లై ఆయన గుండెల్లో గుచ్చుకుంది.

పిల్లాడు మంచోడని.. ఆడపడుచుల గోల్లేదని, అత్తమామలు సాధు స్వభావులని జాగ్రత్తగా వాకబు చేసుకుని మరీ పిల్లనిచ్చాడు. అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడనేమో విధికి కన్ను కుట్టి ఇంతటి విపరీతం చేసింది.

'పిచ్చితల్లి ఎన్నిబాధలు పడుతోందో.. వెళ్ళి చూసొస్తేగాని మనశ్శాంతి వుండదు' అనుకుని హుటాహుటిన పట్నానికి బయల్దేరాడు.

తమింటికొచ్చిన ఆయన్ని సాదరంగా ఆహ్వానించారు ఆ కొత్త దంపతులు.

చిలకా గోరింకల్లాంటి వాళ్ళ అన్యోన్యతని... అనురాగానికి ఎంతో ఆనందం కలిగింది. మనసంతా సంతోషంతో నిండిపోయింది. అయితే అప్పిగాడు చెప్పిందానికి అక్కడ కనిపిస్తున్నదానికి పొంతన కుదరక 'తన ముందు వాళ్ళలా నటిస్తున్నారేమో?' అన్న అనుమానం మనసుని మెలి పెడుతుంటే అల్లుడు ఆఫీసుకి వెళ్ళాక కూతుర్ని డైరెక్టుగా అడిగేశాడు.

దానికామె ఫకాల్న నవ్వి "అయ్యో! పిచ్చినాన్నా! అప్పిగాడు మా ఇంటి కొచ్చినపుడు ఆయనకి సివియర్ కోల్డ్ అంటే భయంకరమైన జలుబు. అది నాకెక్కడ అంటుకుని బాధ పెడుతుందో? అని మీ అల్లుడుగారు నాకు దూరంగా వుండి తల్లడిల్లిపోయారు. ఆయన గురించి మీకనుమానం అక్కర్లేదు. మా ఆయన బంగారం!" అంది.

ఆ మాట ఆయనకి వెయ్యేనుగుల బలాన్ని ఇచ్చింది. అనంతమైన మనశ్శాంతిని కలిగించింది. ఆ రాత్రే ఊరికి బయల్దేరాడు ఆనందంగా.